క్లుప్తంగా

గురుపౌర్ణమికి సిద్ధమవుతున్న సాయి మందిరాలు



వైకేఎం కాలనీలో ఉన్న సాయిబాబా మందిరం

పార్వతీపురం రూరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం జరగనున్న గురుపౌర్ణమి వేడుకలకు పార్వతీపురం పరిసరప్రాంతాలో ఉన్న షిర్డీ సాయి మందిరాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని వైకేఎం కాలనీలో ఉన్న మందిరంతో పాటు, బైపాస్ రోడ్డు, ఎస్.ఎన్ఎం నగర్, చాకలి బెలగాం, నర్సిపురం , తదితర ప్రాంతాల్లో మందిరాలను ఆలయ నిర్వాహకులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఈ ఏడాది గురువారం గురుపౌర్ణమి కలిసి రావడంతో ప్రత్యేకత సంతరించుకున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం 11కేవీ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంత విద్యుత్ ఏఈ రామారావు తెలిపారు

అన్న క్యాంటీన్ తనిఖీ



అన్నా క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: నాణ్యమైన ఆహారంతో నిరుపేదల ఆకలిని తీర్చేందుకే అన్న క్యాంటీన్లు వెలిశాయని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి పరిసరాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఒక సామాన్యుడి మాదిరిగా లైన్‌లో నిల్చుని స్వయంగా టోకెన్ తీసుకుని, అన్న క్యాంటీన్‌లో తయారైన ఆహారాన్ని రుచి చూశారు. ఈ క్రమంలో అక్కడికి విచ్చేసిన పేదలతో కలెక్టర్ ముచ్చటిస్తూ, ఆహారం నాణ్యత, పరిసరాల పరిశుభ్రత వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్న పంటలకు బీమా తప్పనిసరి

కొమరాడ: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న పంటలు వేస్తున్నా రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన్ పథకం ద్వారా తప్పనిసరిగా బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శిక్షణ సమన్వయ కర్త ఆర్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం మండలంలో గంగారేగువలసలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరానికి రూ.800, మొక్కజొన్నకు ఎకరానికి రూ.330 చెల్లించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలోకి రావలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శారద, కురుపాం సహాయ సంచాలకులు ఆర్.అన్నపూర్ణ, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.ప్రసాద్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లు లేకుండా చూడాలి

- ఆర్‌జేడీ విజయభాస్కర్



పేరెంట్ అండ్ టీచర్స్ సమావేశానికి ఆర్‌జేడీకి ఆహ్వానం ఇస్తున్న విద్యార్థినులు

సీతంపేట: విద్యార్థుల్లో డ్రాపౌట్లు లేకుండా చూడాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) విజయభాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ, ఎంఆర్‌సీని సందర్శించారు. కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను అంచనా వేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారం వంటివి అందాయా, లేదా అని అడిగితెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎంఆర్‌సీని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.ఆనందరావు, సూర్యచంద్ర, కేజీబీవీ ప్రిన్సిపాల్ సీహెచ్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ఓటర్ల నమోదు..

వీరఘట్టం: పద్దెనిమిదేళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల పరిధిలో తరచూ ఓటర్ల నమోదు కార్యక్రమాలు నిర్వహించి, ఓటుహక్కుపై పౌరులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రోడెక్కిన కార్మిక సంఘాలు



సాలూరు: ర్యాలీలో మాట్లాడుతున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలీ సంఘం, పలు ఉద్యోగ సంఘాల నాయకులు



సీతానగరం: ర్యాలీలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటరమణ



మక్కువ: ర్యాలీ నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

- దేశ వ్యాప్త సమ్మెకు సంఘీభావం
- కార్మికవర్గానికి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్

సాలూరు:

కార్మికుల హక్కులు కాపాడుకోవడానికి ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలీ సంఘం, పలు ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. లేబర్‌కోడ్‌ల రద్దు తదితర డిమాండ్లతో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం సాలూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణ నుంచి అంగన్వాడీ, ఆశ, సీహెచ్‌డబ్ల్యూ, వీఆర్‌ఏ, మున్సిపల్, స్కూల్ ఎండీఎం, వ్యవసాయ, గిరిజన, రైతు కూలీ సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో కార్మికవర్గం భారీ ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్డు గుండా చిన బాజరు, వేదసమాజం, నాయుడువీధి, శివాజీ బొమ్మజంక్షన్ నుంచి వైఎస్సార్‌కూడలి వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మిక పోరాటం ఆగదని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికవర్గానికి సంక్షేమ పథకాలు ఇవ్వాలని, 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, యాప్‌ల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అవసరం లేని యాప్‌లను రద్దు చేయాలని, ఎన్నికల ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎన్‌వైనాయుడు, ఎం.శ్రీను, ఆసిరి, కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని బలిజిపేట, సీతానగరం, మక్కువ తదితర ప్రాంతాల్లో కార్మిక సంఘాలు నిరసన ర్యాలీలు నిర్వహించి తమ డిమాండ్ల పరిష్కారం కోసం నినదించారు.



మక్కువ: మెయిన్‌రోడ్డులో మానవహారంగా రూపొందిన రైతుకూలీసంఘం నాయకులు, కార్యకర్తలు



బలిజిపేట: బస్టాండ్‌లో మానవహారంగా రూపొందిన కార్మిక సంఘాలు

ఫల సాయం ఇచ్చే మొక్కలనే నాటాలి

పార్వతీపురం రూరల్: గిరిజనుల భూముల్లో ఫల సాయం ఇచ్చే మొక్కలను మాత్రమే నాటాలని, తద్వారా వారికి జీవనోపాధిగా ఉంటుందని సీపీఎం పార్వతీపురం మండల నాయకుడు పి.రాము అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలం సంగవలస పంచాయతీ సీతంపేట గిరిజన గ్రామస్తులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్వే నిర్వహించి, వారు సాగు చేస్తున్న భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో అటవీ శాఖ అధికారుల ఒప్పందంతో జీడి, మామిడి, కుంకుడు, ఉసిరి, నేరేడు, పనస వంటి పల సాయం అందించే మొక్కలు నాటేందుకు అంగీకరించి, మొక్కలు కూడా పంపిణీ చేశారు. మూడు సంవత్సరాల పాటు వాటి సంరక్షణకు సంబంధించిన బాధ్యత అటవీశాఖ తరఫున తీసుకుంటామని చెప్పిన అధికారులు. ప్రస్తుతం మాట మార్చి టేకు మొక్కలను మాత్రమే నాటాలని చెప్పడం అంతేకాకుండా వేరే వ్యక్తులతో గిరిజనుల భూముల్లో టేకు మొక్కల నాటించడం ద్వారా గిరిజనులకు అన్యాయం చేయడమేనన్నారు. తక్షణమే ఆటవీ శాఖ అధికారులు గతంలో గిరిజనులకు ఇచ్చిన ఒప్పందాన్ని గుర్తెరిగి గిరిజనులకు ఉపాధి నిచ్చే మొక్కల పెంపకాలకు ప్రోత్సాహం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే గిరిజనుల తరఫున జిల్లా కేంద్రంలో సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తామని తెలిపారు.

నానో ఎరువులతో నత్రజని శాతం పెరుగుదల



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి అశోక్

పార్వతీపురం రూరల్: నానో ఎరువులతో భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని, సంప్రదాయ ఎరువులకు బదులుగా నానో ఎరువులను వాడుకుంటే అధిక ప్రయోజనాలు ఉంటాయని పార్వతీపురం మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పుట్టూరులో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ పంట పొలాల్లో అధికంగా చల్లుతున్న సాధారణ యూరియా వల్ల కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, నేలసారం దెబ్బతింటుందని, దీన్ని అధిగమించడానికి నానో ఎరువులు ఎంతగానో ఉపయోగపడతాయని భారత వ్యవసాయ పరిశోధన మండలి'(ఐసీఏఆర్) పరిశోధన సంస్థలు ఇప్పటికే వెల్లడించాయని తెలిపారు. నానో ఎరువుల వాడకంతో పంటల ఆహారోత్పత్తుల్లో పోషక విలువలు కూడా పెరుగుతాయని రైతులకు చెప్పారు.

పర్మినెంట్ ఉపాధ్యాయుడిని నియమించండి



మూతబడి ఉన్న పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ మాదల సింహాచలం

పాచిపెంట: మండలంలోని గొట్టూరు పంచాయతీ కన్నయ్యవలస జీటీ డబ్ల్యూ పాఠశాలకు పర్మినెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ మాదల సింహాచలం బుధవారం డిమాండ్ చేశారు. పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు పది రోజుల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా వేరే ప్రాంతానికి వెళ్లారని అప్పట్నుంచి వేరే పాఠశాలకు చెందిన ఒక్కొక్క ఉపాధ్యాయుడిని ఒక్కొక్క రోజు డిప్యుటేషన్‌పై పంపించడంతో పాఠశాల ఒక రోజు తెరుచుకుంటే మూడు రోజులు మూతపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యకు పెద్దపీట వేస్తున్నామని ఒవైపు ప్రభుత్వ పెద్దలు సమావేశాలు పెట్టి ఉపన్యాసాలిస్తున్నారని గిరిజన ప్రాంతంలో మాత్రం అది ఆచరణ సాధ్యం కావడం లేదన్నారు. గిరిజన శాఖ మంత్రి ఉన్న నియోజకవర్గంలోనే గిరిజనులకు విద్య అందడం లేదని ఇప్పటికైనా అధికారులు, మంత్రి స్పందించి గిరిజన ప్రాంతాల్లో ఉన్న జీటీ డబ్ల్యూ పాఠశాలలకు పర్మినెంట్ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి



మానవహారంగా ఏర్పడిన కార్మికులు

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీతంపేటలో కార్మికులు బుధవారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్లు, వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, కాంతారావు, శ్రీరాములు, సాంబయ్య, పార్వతి, అంజిలి, అరుణ, రొయ్య భారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పోస్టుల భర్తీ

సీతానగరం: ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడానికి చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. ఈ మేరకు మండలంలోని కృష్ణారాయపురంలో బుధవారం సాయంత్రం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని అందుకనుగుణంగా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. అలాగే గ్రామప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, స్థానిక సర్పంచ్ జి.అన్నం నాయుడితో పాటు పలుగ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యం నాయుడు ఆర్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు జిల్లా వినియోగదారుల సదస్సు

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ విష్ణుమూర్తి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేసేందుకు గాను ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను తెలియజేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కొత్తపల్లిలో పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

గరుగుబిల్లి: ప్రస్తుతం అడపదడపా వర్షాలు కురవడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లకు ప్రతీ రోజు ఇంటిలోని చెత్తను అందజేయాలన్నారు. ఇంటిముందు మురుగునిల్వలు లేకుండా చూడాలన్నారు. పంచాయితీ కార్యదర్శి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థిక పుష్టిని సాధించాలి

పంచాయతీలు ఆర్థిక పుష్టిని సాధించేందుకు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) సెంటర్‌ను ఆయన పరిశీలించి తయారైన వర్మీ కంపోస్టును విక్రయించేలా సిబ్బందికి ఆదేశించారు. ఆయనతో పాటు కార్యదర్శి తదితరులు న్నారు.

అన్నదాత పట్ల నిర్లక్ష్యం..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు, బాలేరు ఎంపీటీసీ సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి ఆరోపించారు. ఈమేరకు బాలేరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..రైతుసేవా కేంద్రాల ద్వారా కనీసం ఎరువులు కూడా ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. గతంలో రైతు భరోసా కేంద్రాలు నిత్యం రైతు అవసరాలు తీర్చేవన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎరువులన్నీ ప్రైవేట్ డీలర్లకు అందించి చేతులు దులుపుకుందని.. దీంతో రైతులు ఎరువులు, విత్తనాలందక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదని మండిపడ్డారు. వారి వెంట పార్టీ నాయకుడు మేడిబోయిన చలపతి ఉన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురం రూరల్: సురక్షిత ప్రసవమే ధ్యేయంగా గర్భిణులకు వైద్య సేవలు అందజేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, వాటి నివేదికలు రికార్డులు, ఎంసీపీ కార్డుల్లో పరిశీలించారు. హిమోగ్లోబిన్ శాతం కొంతమంది గర్భిణుల్లో వృద్ధి చెందకపోవడాన్ని గమనించి అందుకు గల కారణాలపై వైద్యసిబ్బందిని ఆరా తీశారు. ఐరన్, కాల్షియం మాత్రలు, పౌష్టికాహారం సరిగా తీసుకుంటున్నారా? లేదా? గృహ సందర్శన చేసి గమనించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్యస్థితి, అందుతున్న వైద్యం, అంగన్వాడీ సేవలపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా అక్కడున్న గర్భిణులకు సూచించారు. పీహెచ్‌సీలో తాగునీటి లభ్యతను పరిశీలించారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందితో సమీక్షించి రక్తహీనత, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం మెరుగుకు కార్యాచరణ చేయాలని చెప్పారు. ఈ మేరకు ప్రతి నెలా పీహెచ్‌సీలో ఎన్ని సాధారణ కాన్పులు చేపడుతున్నారో రికార్డుల్లో పరిశీలించారు. అన్ని సాధారణ ప్రసవాలు పీహెచ్‌సీలో జరిగేలా కృషి చేయాలని కోరారు. ల్యాబ్, లేబర్ రూమ్, వార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణ, ప్రాంగణాన్ని ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా.రఘు, వైద్యాధికారులు డాక్టర్ ఎస్ఎంకె తిరుమల ప్రసాద్, డా. శ్రీకాంత్, సూపర్‌వైజర్ శ్రీరాములు నాయుడు, నాగమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సుస్థిర ప్రణాళిక రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి క్షేత్రస్థాయి ఉద్యోగులు అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ పురోగతి సూచిక పంచాయతీ అడ్వాన్స్ మెంట్ (పీఏఐ)ఇండెక్స్ శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ ఎంఎల్ ఎన్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిరమైన అభివృద్ధి చేయడానికి ఇంజినీరింగ్, డిజిటల్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఎంలు సమన్వయంతో ప్రణాళికలు తయారుచేసుకోవాలని అందుకు తగిన అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కోర్సు డైరెక్టర్లు మనోహర్, శ్రీనివాసరావు, శశిభూషణరావు శిక్షణలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె. కుమారవర్మ, సచివాలయాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: పంచాయతీల అభివృద్ధికి అధికారులంతా కృషిచేయాలని ఎంపీడీవో డీడీ.స్వరూపరాణి కోరారు. ఈ మేరకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్(పీఏఐ) కార్యక్రమంపై పలుశాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతతో కూడిన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. పేదరికంలేని, మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, రహదారి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా విధులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన



ఎల్ఐసీ బ్రాంచ్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

పార్వతీపురం: ఎల్ఐసీ బీమా సంస్థ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలని కోరుతూ బ్రాంచ్ ఎదుట ఉద్యోగులు తమ నిరసన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎల్ఐసీ పార్వతీపురం బ్రాంచ్ ఆవరణలో సంస్థ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ ప్రసాద రావు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎన్‌పీఎస్ పింఛన్ విధానం తొలగించి ఓపీఎస్ పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు.

సంస్థలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల కొరత కారణంగా పనిభారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో ఉద్యోగ సంఘం కార్యదర్శి టి.ధర్మతో పాటు బ్రాంచ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.